వంతెన నిర్మాణానికి మోక్షమెప్పుడో?

- గత సంవత్సరం వరదలకు కొట్టుకుపోయిన ముల్కలపల్లి బ్రిడ్జి
- లోలెవల్ వంతెన మీదుగా రాకపోకలు


డిస్క్‌స్లాబ్‌లు కొట్టుకుపోగా మిగిలిన పిల్లర్లు

డోర్నకల్: కురవి–ఖమ్మం రహదారిలో ముల్కలపల్లి సమీపంలోని ఆకేరువాగుపై నిర్మించిన బ్రిడ్జి వరదల్లో కొట్టుకుపోయి సంవత్సరం దాటింది. భారీ వర్షాలతో 2024 సెప్టెంబర్ 1న ఆకేరువాగుకు వరద పోటెత్తి దుబ్బగడ్డతండా, మోదుగ్గడ్డతండా, ముల్కలపల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. భారీ వరదతో వాగుపై నిర్మించిన బ్రిడ్జి కొట్టుకుపోయింది. బ్రిడ్జికి సంబంధించి ఏడు పిల్లర్లపై నిర్మించిన భారీ డిస్క్ స్లాబ్‌లు వరదకు కొట్టుకుపోయాయి. 2009లో నిర్మించిన బ్రిడ్జి భారీ వరదతో అతలాకుతలమైంది. ప్రతీరోజూ బ్రిడ్జి మీదుగా వేలాది వాహనాలు ఖమ్మం, మహబూబాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లా సరిహద్దులోని ఆకేరువాగు బ్రిడ్జి వరదకు కొట్టుకుపోవడంతో సుమారు నెలరోజుల పాటు ఈ మార్గంలో రాకపోకలు నిలవడంతో అప్పట్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బ్రిడ్జి పక్కనే ఉన్న పాత లోలెవల్ బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు చేసి, వినియోగంలోకి తేవడంతో ప్రస్తుతం పాత బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగుతున్నాయి. ఆకేరువాగుకు మోస్తరు వరద వచ్చినా లోలెవల్ బ్రిడ్జి మీదుగా వరద ప్రవహించే అవకాశాలు ఉన్నాయి. బ్రిడ్జి వరదలో కొట్టుకుపోయి సంవత్సరం దాటుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఈ ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు కొత్త బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు కూడా సిద్ధం కాకపోవడంతో బ్రిడ్జి నిర్మాణానికి మరో రెండేళ్లు పట్టే అవకాశాలు ఉన్నాయి. బ్రిడ్జి పనులు త్వరగతిన ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలి

- ఎమ్మెల్యే కోరం కనకయ్య


గార్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

గార్ల: రాష్ట్రంలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక ఎంపీటీసీ స్థానాలు కైవసం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. సోమవారం గార్ల వర్తకసంఘం భవనంలో జరిగిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల పథకాలు అమలు చేశారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి విస్తృత ప్రచారం చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక ఎంపీటీసీ స్థానాలు కైవసం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, గుండా వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్, మాజీ జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, మండా రాముగౌడ్, భూక్యా నాగేశ్వరరావు, హతీరాం, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

బయ్యారం: స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండల కేంద్రంలోని కోదండ రామచంద్రస్వామి ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సమావేశంలో ఇల్లందు మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు ముసలయ్య, మధుకర్‌రెడ్డి, కిషన్‌నాయక్, ప్రవీణ్, రాము, లక్ష్మి, సోమేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్‌గా శ్రీనివాస్



బయ్యారం: ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్‌గా మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన పూనెం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. రాష్ట్రంలో ఉన్న 15 ఆదివాసీ సంఘాల సమావేశం ఇటీవల భద్రాచలంలో జరిగింది. ఈ సమావేశంలో ఆదివాసీ ఉద్యమాల బలోపేతం కోసం జేఏసీని ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యే పూజలు



దంతాలపల్లి: గ్రామ దేవతల ఒడిలోనే ప్రజలు సురక్షితంగా ఉంటారని ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ అన్నారు. మండలంలోని బీరిశెట్టిగూడెం శివారు పంతులుతండాలో నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీరేణుక ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డాక్టర్ యాకమ్మకు సన్మానం



మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, దక్కన్ సభ సహకారంతో 40 మంది రచయితలు రాసిన తెలంగాణ వైభవం మహిళా చైతన్యం వ్యాసాల గ్రంథావిష్కరణ సభ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సభకు జిల్లా కేంద్రానికి చెందిన రచయిత డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ రాసిన వీరనారి చాకలి ఐలమ్మ వ్యాసం పుస్తక ఆవిష్కరణ ఎంపికైంది. యాకమ్మను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ప్రశంస పత్రం అందించి సన్మానించారు.

కొనసాగుతున్న సమ్మె

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాల, హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న డైలీవేజ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని హాస్టల్ వర్కర్లు సంఘం జిల్లా నాయకుడు హాలావత్ లింగ్యా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏటీడీఓ కార్యాలయం ఎదుట సోమవారం డైలీవేజ్ వర్కర్లు 25వ రోజు నిరవధిక సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో తాజుద్దీన్, లింగన్న, రమేష్, నాగేశ్వర్‌రావు, రాజు, మహేష్, అక్బర్ పాల్గొన్నారు.

గేమ్స్ సెక్రటరీగా అనిల్ ఎన్నిక



కురవి: మహబూబాబాద్ డివిజన్ గేమ్స్ సెక్రటరీగా కురవి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల పీడీ పోరిక అనిల్‌ను సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.దేశీరాంనాయక్ ఆధ్వర్యంలో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కార్యక్రమంలో ఏసీఎం రాములు, స్పోర్ట్స్ ఆఫీసర్ సీహెచ్ కొమ్మాలు, పీడీలు పాల్గొన్నారు.

విద్యార్థికి చేయూత



తొర్రూరు రూరల్: ఎంబీబీఎస్ సీటు సాధించిన మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి ధర్మారపు లోకేష్‌కు మాస్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రూ.20వేల నగదును అందించి చేయూతనిచ్చారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి, ప్రభుత్వ వైద్యాధికారి అలువాల విజయ్‌కుమార్, రాయిశెట్టి యాకేందర్, ధర్మారపు నాగయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు


రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్/కేసముద్రం గూడూరు/నెల్లికుదురు: ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ జన్మదిన వేడుకలు సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకే కట్ చేసి పంచారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలుచోట్ల అన్నదానం చేశారు.

అన్నిరంగాల్లో ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే హరిప్రియ


బయ్యారం: సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రియ

బయ్యారం: స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. మండలంలోని గంధంపల్లి–కొత్తపేట, బయ్యారం, వెంకట్రాంపురం, గౌరారం, కస్తూరినగర్ గ్రామాల్లో సోమవారం నిర్వహించిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్నిరంగాల్లో విఫలమైందని, ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల పదవుల్లో పార్టీ అభ్యర్థులు పోటీలో ఉంటారని, వారి గెలుపునకు పార్టీ శ్రేణులు కష్టపడాలన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, బీఆర్ఎస్ నాయకులు గణేష్, శ్రీకాంత్, ఐలయ్య, సత్యనారాయణ, మురళీకృష్ణ, వెంకన్న, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపు ఖాయం

నర్సింహులపేట: స్థానిక ఎన్నికల్లో అధిక సీట్లు బీఆర్ఎస్ గెలవడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు మైదం దేవేందర్, మాజీ వైస్ ఎంపీపీ జాటోత్ దేవేందర్, కుంభం సుధీర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఖాజామీయా, గుగులోతు రవినాయక్ పాల్గొన్నారు.

అభ్యర్థులను నిలదీయాలి

తొర్రూరు రూరల్: గత శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను నిలదీయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ ఎంపీపీ తూర్పాటి అంజయ్య, మాజీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ కోరారు. సోమవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఎంపీటీసీ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కనకయ్య, తదితరులు

డోర్నకల్: దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. వికసిత్ భారత్ 2047 కార్యక్రమంలో భాగంగా స్థానిక చర్చి కాంపౌండ్‌లో సోమవారం 'వి హీల్ ది ఎర్త్' పేరుతో 12రకాల సేవలతో కూడిన క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య, డోర్నకల్ అధ్యక్ష మండల పీఠాధిపతి రెవ.డాక్టర్ కె.పద్మారావు ప్రారంభించారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్త్రీల మైత్రి సంఘం అధ్యక్షురాలు విజయపద్మారావు, ఎస్తా సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ వి.అచ్యుత్‌రావు, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి ఓలేటి జ్యోతి పాల్గొన్నారు.

అవగాహన ఉండాలి

ఖానాపురం: స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలపై అవగాహన కీలకమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ ఆఫీసర్, డీటీడీఓ సౌజన్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమేశ్, ఎంపీడీఓ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచని జీపీ భవనం


నిరుపయోగంగా ఉన్న మాధవాపురం జీపీ భవనం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని మాధవపురం గ్రామంలో గ్రామపంచాయతీ భవనం ప్రారంభం కోసం ఎదురుచూస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ సుమారు రూ.18లక్షల వ్యయంతో జీపీ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. 2017లో జీపీ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయగా మాధవపురం గ్రామస్తుడు, ఉమ్మడి వరంగల్ మాజీ పార్లమెంటు సభ్యుడు రామసహాయం సురేందర్ రెడ్డి గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి స్థలాన్ని బహూకరించారు. ఆ ప్రాంతంలోనే జీపీ భవన నిర్మాణ పనులు మొదలుపెట్టి క్రమక్రమంగా పూర్తి చేశారు. విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసి, విద్యుత్ కనెక్షన్ ఇచ్చినప్పటికీ భవనం లోపల విద్యుత్ తీగల ఏర్పాటు, పైపులైన్ బిగించలేదు. అదేవిధంగా భవనం లోపల బండలు పరవకపోవడం వల్ల ప్రారంభంలో జాప్యం జరుగుతున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. నూతన గ్రామ పంచాయతీ భవన ప్రారంభం ఎప్పుడో అని గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు.

సీపీఐ అభ్యర్థులను గెలిపించండి


మాట్లాడుతున్న విజయసారథి

కేసముద్రం: ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడే సీపీఐ అభ్యర్థులను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, నియోజకవర్గ కార్యదర్శి బి.అజయసారథి అన్నారు. సోమవారం కేసముద్రం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ మండల అత్యవసర ఎన్నికల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో 4సర్పంచ్, 4ఎంపీటీసీ స్థానాల్లో, 50 వార్డు స్థానాల్లో పార్టీ పోటీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చొప్పరి శేఖర్, మంద భాస్కర్, మడత నారాయణ, పూజారి రవి, ఉపేందర్, లక్ష్మీనర్సయ్య, గురువయ్య, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలి


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పెద్దవంగర: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను కాంగ్రెస్ గెలిచే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఛీజీ బొమ్మెరబోయిన ప్రదీప్, మాజీ వార్డు మెంబర్ భూక్య కృష్ణ, సీనియర్ నాయకులు ఠాగూర్, ముత్యం రవితోపాటు పలువురు నాయకులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్షాల విమర్శలకు ధీటుగా సమాధానాలు ఇవ్వాలని సూచించారు. ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, అభివృద్ధి, సంక్షేమం రెండింటిని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత


విద్యార్థికి ప్రశంస పత్రం అందజేస్తున్న ఎఫ్ఆర్వో రవికిరణ్

ఖానాపురం: వన్యప్రాణుల సంరక్షణను సామాజిక బాధ్యతగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) పుప్పాల రవికిరణ్ అభివర్ణించారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. వన్యప్రాణుల మనుగడ పర్యావరణ సమతుల్యతపై ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు, యువత పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. విద్యార్థి దశలోనే వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన పెంచేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. జీవవైవిధ్యాన్ని కాపాడుకుంటే వన్యప్రాణుల సంరక్షణ సులభమవుతుందని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించే దిశగా కృషి చేయాలని కోరారు.

రేపు హుండీ లెక్కింపు

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 8న బుధవారం ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో ఆలయంలోని కల్యాణ మండపంలో హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్ల ఈఓ పేర్కొన్నారు.

ఇంట్లో చోరీ

గూడూరు: మండలంలోని బొద్దుగొండలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఓ ఇంటి తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం తెలిసింది. ఇంటి యజమానురాలు మోదుగు భారతమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. పండగకు భారతమ్మ కూతురు అత్తవారి ఇంటి నుంచి బొద్దుగొండలోని తల్లి ఇంటికి వచ్చింది. పండుగ ఖర్చుల కోసం అప్పుగా తెచ్చిన డబ్బులతో పాటు తనకు చెందిన 25తులాల వెండి పట్టీలు బీరువాలో పెట్టింది. ఆదివారం రాత్రి గ్రామంలోని తన తమ్ముడి ఇంటికి తల్లి భారతమ్మతోపాటు పండుగకు వచ్చిన కూతురు ఇంటికి తాళం వేసి వెళ్లి, అక్కడే పడుకున్నారు. తెల్లవారి లేచి ఇంటికి వచ్చి చూడగా, తలుపులు పగులగొట్టి ఉన్నాయి. బీరువా తాళం పగులగొట్టి, బట్టలు కిందపడేసి, అందులోని వెండి పట్టీలతోపాటు నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయం పోలీసులకు సమాచారం అందించారు. భారతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ మృతి


అజ్మీర సేలా (ఫైల్)

మరిపెడ రూరల్: పురుగుల మందు తాగి మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన మరిపెడ మండలం సోమ్లతండా గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సోమ్లతండాకు చెందిన అజ్మీర సేలా(45)కు భర్తతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల మరోసారి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సేలా ఆదివారం గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించి అక్కడి చికిత్స అందించారు. ఆమె పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎన్నికల నియమావళిపై అవగాహన ఉండాలి

డోర్నకల్: ఎన్నికల నియమావళిపై ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాసనాయక్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం స్థానిక సంస్థల ఎన్నికలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి నర్సింహామూర్తి, తహసీల్దార్ ఇమ్మానియల్, నాయకులు పాల్గొన్నారు.

అభ్యర్థుల పేర్ల నమోదు

కురవి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కాంపల్లి సొసైటీ చైర్మన్ కొండపల్లి శ్రీదేవి అన్నారు. సోమవారం సీరోలు మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ అభ్యర్థుల పేర్లను బీఆర్ఎస్ నాయకులు ఆమెకు అందించారు. సీరోలు ఎంపీటీసీ అభ్యర్థులుగా జలగం వెంకన్న, మామిళ్ల వెంకన్న పేర్లతో కూడిన జాబితాను అందించారు. సీరోలు జెడ్పీటీసీ అభ్యర్థిగా తేజావత్ భోజ్యా పేరును ఖరారు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దొంగలి నర్సయ్య, మక్కల వెంకన్న, బీకోజీ, తగరం వెంకన్న పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మహబూబాబాద్ రూరల్: ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.2,670 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపిక సోమవారం తెలిపారు. మండలంలోని ముదుపుగల్ గ్రామ పరిధిలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా స్థానికంగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి చూడగా మార్కపురి లక్ష్మణ్, ఇనుగుర్తి రాంరెడ్డి, జోరుక ఉపేందర్, అల్లిపురం మల్లయ్య, నూనె కిరణ్ పేకాట ఆడుతూ పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి నగదు, సెల్ ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

ప్రతిభావంతులకు సన్మానం



కురవి: సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రతిభావంతులకు ఉపాధ్యాయులు సోమవారం పాఠశాలలో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన మద్దినాల లావణ్య, ఎంబీబీఎస్ సీటు సాధించిన మేకల లిఖిత, గ్రూపు–2లో ఉద్యోగం సాధించిన పోగుల వినయ్‌ను పూలమాలలు వేసి సన్మానించారు. హెచ్ఎం డోలి అరుణశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒంటెద్దు పోకడకు స్వస్తి పలకాలి

నెల్లికుదురు: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీనియర్ కార్యకర్తలు, ఉద్యమకారులను విస్మరిస్తూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ మధ్యలో వచ్చిన వారికి వంత పాడుతున్న మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ ఒంటెద్దు పోకడకు స్వస్తి పలకాలని, లేకుంటే పార్టీ కష్టాల్లో పడే అవకాశం ఉందని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యాసం రమేష్, నాయకుడు ఆకుల జగ్గయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో సోమవారం వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వీరగోని మల్లేశం, అజయ్, మలేష్, యాకయ్య, నరేష్, వివేక్ పాల్గొన్నారు.

బూర్జువా పార్టీలను ఓడించండి

కేసముద్రం: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ బూర్జువా, దోపిడీ వర్గ పార్టీలను ఓడించాలని ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి పానుగంటి నర్సయ్య అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధి కేసముద్రంవిలేజ్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మూడు జెడ్పీటీసీ, పది ఎంపీటీసీ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఉల్లి ప్రతాప్, మర్రిపెల్లి మొగిలి, జాటోత్ బిచ్యానాయక్, ప్రియాంక పాల్గొన్నారు.

వేతనాల అందజేతపై కృతజ్ఞతలు

మహబూబాబాద్ అర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులకు (సీఆర్టీలు) నాలుగు నెలల పెండింగ్ వేతనాలు అందించినందుకు కృషి చేసిన మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, గిరిజన శాఖ అధికారులకు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ధారావత్ బాలాజీ నాయక్, రాష్ట్ర కోశాధికారి శ్రీను, జిల్లా నాయకులు భూక్య భరత్, తేజావత్ హుస్సేన్, వెంకన్న, రవీందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

దంతాలపల్లి: మండలంలోని రామానుజాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఓలాద్రి రమేష్‌రెడ్డి తండ్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సత్తిరెడ్డి ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఉగ్గంపల్లిలో..


చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన గండి సాయిమల్లు అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ నివాళులర్పించాడు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించాడు. కార్యక్రమంలో భర్తాపురం కొమిరెల్లి, అయూబ్‌పాషా, రమేష్, అబ్దుల్ అలీమ్ ఉన్నారు.

నోట్‌బుక్స్ వితరణ



గార్ల: గార్లలోని పుట్టకోట బజారులో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు బేతి వెంకటేశ్వర్లు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను సోమవారం ఎంఈఓ వీరభద్రం చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాంప్రసాద్, వజ్రం నాగేశ్వరరావు, హెచ్ఎం వీరన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేతకాని సామాజిక వర్గానికి టికెట్ ఇవ్వాలి


మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

గంగారం: నేతకాని సామాజిక వర్గానికి జెడ్పీటీసీ టికెట్ ఇవ్వాలని నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సన్న తెలిపారు. సోమవారం మంత్రి సీతక్కకు వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగారం మండలంలో నేతకాని జనాభా అధికంగా ఉన్నందున, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రిజర్వేషన్ ప్రకారం అక్కడ జనరల్ రావడంతో తమ సామాజిక వర్గానికి చెందిన జాడి వెంకటేశ్వర్లుకు జెడ్పీటీసీ అభ్యర్థిగా టికెట్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు జనగం లక్ష్మణ్, రాజం నర్సయ్య, గోగు సునీల్, కృష్ణ, రత్నం, రాంచంద్రరావు పాల్గొన్నారు.